సాక్షి కాకినాడ

శుక్రవారం । 19 । సెప్టెంబర్ । 2025



నర్సింగ్.. మరింత మెరుగ్గా..
రోగులకు సేవలందించడంలో నర్సుల పాత్ర కీలకం. నిస్వార్థతతో ప్రాణాలు కళ్లలో పెట్టుకుని బతుకీడుస్తున్న రోగుల హృదయాల్లో వారి స్థానం ఎంతో ఉన్నతం.



ఆమె స్థానం గురుతరం
పరీక్షలు ఏవైనా ఫలితాల్లో చాలా వరకూ బాలికలే ప్రతిభ కనబరచడం చూస్తుంటాం. ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో కూడా మహిళలు సత్తా చాటారు.

8లో

కడలిలోకి 4.17 లక్షల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం 4,17,649 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచి పెట్టారు. తూర్పు డెల్టాకు 3,700, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 4,500 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు.

న్యూస్‌రీల్

రత్నగిరిపై 22 నుంచి దసరా వేడుకలు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో శరన్నవరాత్ర వేడుకలు (దసరా ఉత్సవాలు) ఈ నెల 22 నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకూ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 22వ తేదీ ఉదయం 9 గంటలకు పండితులు సత్యదేవుని ఆలయంలో కలశ స్థాపన చేసి, ఈ ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా కుంకుమ పూజలు, వైదిక కార్యక్రమాలు నిర్వహించే 44 మంది రుత్విక్కులు, 16 మంది అర్చకులకు దీక్షా వస్త్రాలు అందజేస్తామని అధికారులు తెలిపారు.

వేడుకలు జరుగుతాయిలా..

అశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి విజయ దశమి పర్వదినం వరకూ ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ రుత్విక్కులు సత్యదేవుని ఆలయంలో స్వామి, అమ్మవార్లకు.. రామాలయంలో సీతారాములకు, వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లకు శ్రీసూక్త, పురుషసూక్త, మన్యుసూక్త పారాయణలు, లలితా, విష్ణు సహస్రనామ పారాయణలు, లింగార్చన, నవావరణ అర్చన, సూర్య నమస్కారాలు నిర్వహిస్తారు. అలాగే, యంత్రాలయంలోని శ్రీమహా వైకుంఠ నారాయణవిభూతి యంత్రానికి పూజలు చేస్తారు. ప్రధానాలయంలోని శివలింగానికి అభిషేకాలు నిర్వహిస్తారు. శరన్నవరాత్ర వేడుకల్లో భాగంగా సాయంత్రం 4 గంటల నుంచి సత్యదేవుని ఆలయం, దర్బారు మండపం, రామాలయం, వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్ల ఆలయాల్లో రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహిస్తారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకూ సత్యదేవుని ప్రధానాలయంలో రుత్విక్కులు, అర్చకులు దర్బారు నిర్వహించి, నాలుగు వేదాలు, పంచ కావ్యాలు పఠించి, నీరాజన మంత్రపుష్పాదులు సమర్పిస్తారు.

రోజుకో అలంకరణలో..

ఈ నెల 25, 26 తేదీల్లో చవితి తిథి ఉన్నందున దసరా ఉత్సవాలు ఈసారి 11 రోజులు జరగనున్నాయి. ఈ 11 రోజులూ రోజుకో అలంకరణలో వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లను అలంకరించి పూజిస్తారు. తొలి రోజైన 22వ తేదీన బాలాత్రిపుర సుందరి, 23న కల్యాణ గౌరీదేవి, 24న అన్నపూర్ణాదేవి, 25న శారదాదేవి, 26న మహాలక్ష్మి, 27న గాయత్రీదేవి, 28న మహాచండి, 29న సరస్వతి, 30న దుర్గాష్టమి నాడు దుర్గాదేవి, అక్టోబర్ 1న మహర్నవమి నాడు మహిషాసురమర్దిని, అక్టోబర్ 2న విజయ దశమి పర్వదినాన రాజరాజేశ్వరి అలంకరణల్లో అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తారు. దుర్గాష్టమి నాడు చండీహోమం ప్రారంభించి, మహర్నవమి నాడు కొనసాగిస్తారు. విజయ దశమి పర్వదినం నాడు పూర్ణాహుతి నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం కొండ దిగువన దేవస్థానం హైస్కూల్ వద్ద శమీపూజ నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తారు. ఈ సందర్భంగా సత్యదేవుడు, అమ్మవారిని గజ వాహనం మీద అన్నవరంలో ఊరేగిస్తారు. దసరా వేడుకలకు వనదుర్గ, కనకదుర్గమ్మ అమ్మవార్ల ఆలయాలను సర్వాంగసుందరంగా ముస్తాబు చేస్తున్నారు.

పట్టువస్త్రాల సమర్పణ

అన్నవరం: రత్నగిరిపై జరిగే దసరా ఉత్సవాలకు విజయవాడకు చెందిన రావాడ చిరంజీవిరావు దంపతులు ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా రూ.75 వేల విలువ చేసే పట్టువస్త్రాలను గురువారం సమర్పించారు. వీటిని సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, రామాలయంలో శ్రీరాముడు, సీతాదేవి, వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు, యంత్రాలయంలోని దేవతామూర్తులకు అలంకరించాలని కోరారు. దాత నుంచి ఈ పట్టువస్త్రాలను ఈఓ వీర్ల సుబ్బారావు, ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం స్వీకరించారు.

పత్రికా స్వేచ్ఛను హరించడం సరికాదు



ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తున్న మీడియా రంగాన్ని అణచివేసేలా కూటమి ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సరికాదు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇలాంటి పరిస్థితులు లేవు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా.. చేస్తున్న మోసాలను, వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తోందనే కక్షతో సాక్షి ఎడిటర్, పాత్రికేయులపై అక్రమంగా కేసులు పెట్టడం దారుణం. ఈ అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలి.

– ఆకుల వీర్రాజు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) మాజీ చైర్మన్



అక్రమ కేసులు సిగ్గుచేటు



ప్రజాస్వామ్యంలో ఎన్నడూ లేని విధంగా కూటమి సర్కార్ నీచ సంస్కృతికి నాంది పలుకుతోంది. విలేకర్ల సమావేశంలో టీడీపీ నేతల అక్రమాల గురించి మాట్లాడితే.. పత్రిక పైన, సాక్షి ఎడిటర్, పాత్రికేయులపై కేసులు పెట్టడం సిగ్గుచేటు. పత్రికా స్వేచ్ఛను హరిస్తూ.. రాజ్యాంగ విలువలను కూటమి పాలకులు కాలరాస్తున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న దారుణాలను తెలుగు ప్రజలకు వివరించడమే విలేకర్లు చేసిన తప్పా? సాక్షి ఎడిటర్, పాత్రికేయులపై కేసులు తక్షణం ఎత్తివేయాలి.

– చందన నాగేశ్వర్, మాజీ చైర్మన్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్

కాకి లెక్కలు

- అసాధారణ స్థాయిలో పీహెచ్‌సీ సేవల గణాంకాలు
- జనాభాతో పొంతన లేకుండా సేవలు!
- ర్యాంకుల కోసమే తప్పుడు లెక్కలని సందేహాలు
- 28 పీహెచ్‌సీలకు తాఖీదులు



సామర్లకోట మండలం వేట్లపాలెం పీహెచ్‌సీ

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ)లో వైద్య సేవలపై ర్యాంకుల కోసం కాకి లెక్కలు తయారవుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చే ర్యాంకుల కోసం కొన్ని పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది కుమ్మక్కై ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో తప్పుడు లెక్కలు రూపొందిస్తున్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో పీహెచ్‌సీలు మెరుగైన ర్యాంకులు సాధించాలంటే అందుకు తగ్గట్టు ప్రజలకు నాణ్యమైన సేవలందించాలి. కానీ, ర్యాంకుల కోసం పీహెచ్‌సీల్లో అవుట్ పేషెంట్ (ఓపీ), ఇన్‌పేషెంట్ (ఐపీ), ల్యాబ్ టెస్ట్‌లు తదితర ఐదు రకాల సేవలపై అడ్డగోలుగా గణాంకాలు రూపొందిస్తున్నారు. దీనిని తీవ్రంగా పరిగణించిన ఆ శాఖ ఉన్నతాధికారులు ఆయా పీహెచ్‌సీలకు తాఖీదులు జారీ చేయడం సంచలనం రేపింది.

ఏం జరిగిందంటే..

వైద్య, ఆరోగ్య శాఖలో ఉన్నతాధికారుల నుంచి జిల్లా స్థాయి అధికారులకు, అక్కడి నుంచి క్షేత్ర స్థాయిలో పీహెచ్‌సీలకు వైద్య సేవలపై ప్రతి నెలా లక్ష్యాలు నిర్దేశిస్తుంటారు. ఈ లక్ష్య సాధనలో ర్యాంకులు దక్కించుకోవాలంటే పీహెచ్‌సీల్లో అందిస్తున్న సేవలపై రూపొందించే గణాంకాలే ప్రామాణికం. వీటిని కచ్చితంగా సాధించాలనే ఒత్తిళ్లు కూడా పై నుంచి ఉంటాయి. అయితే, **పలు పీహెచ్‌సీల్లో ఆ గణాంకాలు వాస్తవానికి దూరంగా రూపొందిస్తున్నారు. ఇటీవల జిల్లాలోని పలు పీహెచ్‌సీల్లో అపరిమితంగా నమోదైన వైద్య సేవలపై వైద్య, ఆరోగ్య శాఖ డైరెక్టరేట్ వివరణలు కోరడంతో** ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

ర్యాంకుల కోసం అడ్డదారులు

సాధారణంగా పీహెచ్‌సీల పరిధిలో జనాభా ఆధారంగా ప్రతి నెలా ఓపీ, ఐపీ సేవలు, ల్యాబ్‌లో ఎన్ని పరీక్షలు నిర్వహిస్తారనే అంచనాలు రూపొందిస్తుంటారు. ఐదేళ్ల కాలంలో ఈ గణాంకాలను సరాసరి అంచనా వేసి ర్యాంకులకు బెంచ్‌మార్క్ నిర్ణయిస్తారు. వీటి కంటే ఎక్కువ సంఖ్యలో సేవలందించే పీహెచ్‌సీలు, వైద్యులు, సిబ్బందికి ర్యాంకులు ఇస్తుంటారు. ఈ ర్యాంకుల కోసం కొన్ని పీహెచ్‌సీలలో కొందరు అడ్డదారులు తొక్కుతున్నారు. జిల్లావ్యాప్తంగా 40 పీహెచ్‌సీలు, 20 అర్బన్ పీహెచ్‌సీలు ఉన్నాయి. ఇవి కాకుండా పిఠాపురం, పెద్దాపురం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, సామర్లకోట, జగ్గంపేట, శంఖవరం, రౌతులపూడి, పెదపూడిల్లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సీహెచ్‌సీ) ఉన్నాయి. వీటి ద్వారా గ్రామ, మండల స్థాయిల్లోని పేద, మధ్య తరగతి వర్గాలకు ప్రాథమిక వైద్య సేవలందిస్తుంటారు. ఇలా అందించిన సేవలపై ప్రతి నెలా గణాంకాలతో కూడిన నివేదికలు పంపిస్తుంటారు.

సందేహం వచ్చిందిలా..

ఈ విధంగా 28 పీహెచ్‌సీల నుంచి అందిన ఓపీ, ఐపీ, ఇతర పరీక్షల నివేదికలు వాస్తవానికి దూరంగా ఉన్నాయని వైద్య, ఆరోగ్య శాఖ సమీక్షలో ప్రిన్సిపల్ సెక్రటరీ గుర్తించారని తెలుస్తోంది. కొన్ని పీహెచ్‌సీల్లో రోజువారీ 100 నుంచి 150 ఓపీ కూడా ఉన్నట్టు నివేదికలు పంపించడంతో ఉన్నతాధికారులు సందేహించారు. వాస్తవానికి ఒక పీహెచ్‌సీలో ఒక్క రోజులో అంత ఓపీ సేవలు అసాధ్యమనే అభిప్రాయానికి వచ్చి, ఇదంతా ర్యాంకుల కోసం రూపొందించిన కాకి లెక్కల్లా ఉన్నాయని ప్రాథమికంగా నిర్ధారించినట్లు సమాచారం. జనాభా ఆధారంగా పీహెచ్‌సీలకు వచ్చే రోగుల సంఖ్యను సుమారుగా నిర్ధారించవచ్చు. ఉదాహరణకు 50 వేల జనాభా ఉన్న పీహెచ్‌సీ పరిధిలో రోజుకు తక్కువలో తక్కువ 100 మంది రోగులు ఉంటారని అంచనా. అదే 20 వేల లోపు జనాభా ఉన్న ఏవీ నగరం, పెరుమాళ్లపురం వంటి పీహెచ్‌సీలకు ఇందులో సగం మంది వస్తే గొప్పేనని అంటున్నారు. జనాభా ఎక్కువ, తక్కువతో సంబంధం లేకుండా పలు పీహెచ్‌సీల్లో 150 ఓపీ కూడా ఉన్నట్లు నివేదికలు పంపించడానికి ర్యాంకుల ఆరాటమే కారణమని చెబుతున్నారు. వైద్య, ఆరోగ్య శాఖలో జిల్లా స్థాయి నుంచి లక్ష్యాలు సాధించాలనే ఒత్తిళ్లతోనే ఇలాంటి లెక్కలు పంపించాల్సి వస్తోందని పీహెచ్‌సీల్లోని వైద్యులు పేర్కొంటున్నారు.

వైద్యాధికారుల బాధ్యతారాహిత్యం!

ఇందులో వైద్యాధికారుల బాధ్యతారాహిత్యం కూడా లేకపోలేదనే విమర్శలు వస్తున్నాయి. పీహెచ్‌సీల్లో సేవలపై స్వయంగా వైద్యాధికారులే రిజిస్టర్లు నిర్వహించాలని చెబుతున్నారు. కానీ, ఆ బాధ్యతను కొందరు వైద్యాధికారులు సిబ్బందికి అప్పగించి చేతులు దులిపేసుకుంటున్నారని అంటున్నారు. అడపాదడపా ఉన్నతాధికారులు లేదా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలను సందర్శించే సందర్భంలో సమయానికి వైద్యులు వస్తున్నారా లేదా, ఓపీ రిజిస్టర్లు తయారు చేస్తున్నారా లేదా అనేది మాత్రమే చూస్తున్నారు తప్ప వైద్యాధికారులు స్వయంగా వీటిని నిర్వహిస్తున్నారా లేదా అనేది పరిశీలించడం లేదని అంటున్నారు.

ఈ విషయంలో తప్పెవరిదైనా జిల్లాలోని 28 పీహెచ్‌సీల నుంచి వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వివరణలు కోరడం ఆ శాఖలో హాట్‌టాపిక్‌గా మారింది. వీటిలో ఇప్పటి వరకూ 15 పీహెచ్‌సీల నుంచి మాత్రమే వివరణలు అందాయి. 13 పీహెచ్‌సీలు మాత్రం ఎటువంటి వివరణలూ పంపకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయంటూ ఉన్నతాధికారులు తాఖీదులు కూడా ఇచ్చారు. ఓపీ, ఐపీల సంఖ్య అసాధారణంగా ఉండటంపై మరోసారి పరిశీలన జరిపి, నివేదికలు పంపాలని ఆదేశించారు. పండూరు, ఏవీ నగరం, తూరంగి, వేట్లపాలెం, తొండంగి, దుగ్గుదూరు, విరవ, రాజపూడి, శంఖవరం, శాంతి ఆశ్రమం, కాత్రావులపల్లి, నాగులాపల్లి, గాడిమొగ పీహెచ్‌సీల్లో ఓపీ, ఐపీ లెక్కలు సరిచేసి పంపించాలని ఆదేశాలు వచ్చాయి.

నేడు ఉద్యోగుల గ్రీవెన్స్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గాను శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగే ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యోగులకు సూచించారు.

సాగునీటి చెరువుల అభివృద్ధికి చర్యలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జిల్లాలోని సాగునీటి చెరువుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సాగునీటి చెరువుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మరమ్మతులు, ఆధునీకరణ, నీటి నిల్వల సామర్థ్యం పెంచడం (రిపేర్, రిన్నోవేషన్, రిస్టోరేషన్ – ఆర్ఆర్ఆర్) పథకంపై కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూగర్భ జలాల పెంపు, ఆయకట్టు స్థిరీకరణ, ఆయకట్టును పెంచడం ద్వారా సమగ్రాభివృద్ధి సాధించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగునీటి చెరువుల అభివృద్ధికి చర్యలు చేపట్టాయని వివరించారు. ఈ పథకం కింద తొలి దశలో జిల్లావ్యాప్తంగా 50 సాగునీటి చెరువులను గుర్తించి, సమగ్ర వివరాలు సేకరించేందుకు ఇరిగేషన్, వ్యవసాయం, ప్రణాళిక, సర్వే, ఇతర శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో సీపీఓ పి.త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, సర్వే శాఖ ఏడీ శ్రీనివాస్, ఇరిగేషన్, వ్యవసాయం, పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) అధికారులు పాల్గొన్నారు.

పవన్ ఇలాకాలో యూరియా పక్కదారి

- టీడీపీ నేత దుకాణం వద్ద డంపింగ్
- బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు అమ్మకాలు
- అధికారులకు ఫిర్యాదు చేసిన రైతులు
- లారీతో భారీగా యూరియా స్వాధీనం
- కూటమి నేతలపై కేసులు



తాటిపర్తిలో అధికారులు యూరియాతో స్వాధీనం చేసుకున్న లారీ

పిఠాపురం: అవసరమైనంత యూరియా అందుబాటులో ఉందంటూ అధికారుల ప్రకటనలు.. అందరికీ ఇస్తున్నా కావాలని రైతులు రాద్ధాంతం చేస్తున్నారంటూ టీడీపీ నేత బహిరంగ ప్రకటనలు.. తీరా చూస్తే యూరియా దొరక్క రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగడం.. నెల రోజులుగా ఇదే తంతు. ఇటువంటి పరిస్థితుల్లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇలాకా పిఠాపురం నియోజకవర్గంలో రైతులకు అందాల్సిన యూరియాను కూటమి నేతలు పక్కదారి పట్టించి, రూ.లక్షలు వెనకేసుకుంటున్నారన్న నిజం బయటపడింది.

టీడీపీ నేత దుకాణానికి..

గొల్లప్రోలు మండల రైతులు కొన్ని రోజులుగా యూరియా దొరక్క అష్టకష్టాలు పడుతున్నారు. ప్రతి నిత్యం సొసైటీలు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వచ్చిన యూరియా వచ్చినట్టే మాయమవుతూండటంతో వారికి అనుమానం వచ్చింది. దీనిపై ఆరా తీయగా యూరియా అంతా బ్లాక్‌మార్కెట్‌కు తరలిపోతున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఓ టీడీపీ నేతకు చెందిన ఎరువుల దుకాణం వద్ద రెండు లారీల యూరియా డంపింగ్ చేస్తున్న విషయాన్ని గమనించి, ఆందోళనకు దిగారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశారు. తాటిపర్తి గ్రామంలో రెండు రైతు సేవా కేంద్రాలున్నప్పటికీ వాటికి కాకుండా.. టీడీపీ నేత ఎరువుల దుకాణానికి మాత్రం ఇప్పటి వరకూ 12 లారీల్లో సుమారు 250 టన్నుల యూరియా ఇచ్చినట్లు తెలిసింది. విషయం బట్టబయలవడంతో గొల్లప్రోలు వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే ఆయా దుకాణాలపై దాడులు నిర్వహించారు. అక్రమంగా యూరియా తరలించి, రైతులకు ఎక్కువ ధరకు అమ్ముతూ రూ.లక్షలు వెనకేసుకుంటున్నట్లు గుర్తించి, కేసులు నమోదుకు రంగం సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన నియోజకవర్గ టీడీపీ నేత పైరవీలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. యూరియా అక్రమ దందాపై సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరగడంతో విజిలెన్స్ అధికారులు, పోలీసులు రంగంలోకి దిగారు. అక్రమ యూరియా అమ్మకాలను అడ్డుకుని రెండు లారీలను స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేశారు.

యూరియా బ్లాక్ మార్కెటింగ్‌పై కేసులు

విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల సమక్షంలో గొల్లప్రోలు మండల వ్యవసాయ అధికారి, రెవెన్యూ అధికారులు, పోలీసులు కలసి తాటిపర్తి గ్రామ శివారులోని చెరువు వద్ద నిర్వహించిన దాడుల్లో నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్‌కు చెందిన 548 బస్తాల యూరియా(24.660 మెట్రిక్ టన్నులు)తో ఉన్న రెండు లారీలను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై గురువారం రెండు వేర్వేరు కేసులు నమోదు చేశారు. ద్వారపూడి రైల్వే స్టేషన్‌లో వ్యాగన్ నుంచి శ్రీ నాగదుర్గ ఏజెన్సీస్ యజమాని దాసం శ్రీనివాస్, శ్రీ దుర్గా సరస్వతి ట్రేడర్స్ ప్రతినిధి ఉంగరాల వీరబాబు మొత్తం 450 యూరియా బస్తాలను దింపారని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ చెప్పారు. ఆయన కథనం ప్రకారం.. దాసం శ్రీనివాస్ సూచనల మేరకు 225 యూరియా బస్తాలను వన్నెపూడి గ్రామ శివారులో రోడ్డు పక్కన దింపారు. ఒక్కో రైతుకు 3, 4 బస్తాలు ఇచ్చి, మార్కెట్ ధర కంటే రూ.400, నుంచి రూ.500 వరకూ అధికంగా విక్రయించారు. ఈ క్రమంలో హెల్పర్ కనక వీరబాబు, శ్రీనివాస్ ఇచ్చిన ఈ–పోస్ యంత్రాన్ని ఉపయోగించి రైతుల వేలిముద్రలు సేకరించి, అధికారిక రికార్డుల్లో తప్పుడు పంపిణీ చూపించారని సీఐ చెప్పారు. దాసం శ్రీనివాస్ ద్వారపూడి స్టేషన్‌లో రైల్వే వ్యాగన్ నుంచి 450 బస్తాలు (20.250 మెట్రిక్ టన్నులు) లోడు చేసి, తాటిపర్తికి తరలించారని వివరించారు. వాటిలో 127 బస్తాలను ఆటోలు, బైకుల ద్వారా రైతులకు ఎక్కువ ధరకు విక్రయించారని, మిగిలిన 323 బస్తాలను తాటిపర్తి చెరువు పక్కన నిల్వ ఉంచగా, దాడి చేసి, లారీతో పాటు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కేసుల్లో ప్రధాన నిందితుడు దాసం శ్రీనివాస్ తనకు లభించిన యూరియా నిల్వలను లైసెన్స్ కలిగిన షాపు ద్వారా కాకుండా, గ్రామ శివార్లలో దింపి, రైతులకు అధిక ధరలకు బ్లాక్ మార్కెటింగ్ చేశారని చెప్పారు. అలాగే ఈ–పోస్ యంత్రాలను దుర్వినియోగం చేసి, రైతుల వేలిముద్రలను సేకరించి, తప్పుడు రికార్డులు సృష్టించారని సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, ముద్దాయిలను పిఠాపురం కోర్టులో హాజరు పరిచామని చెప్పారు.

అధికారులపై అనుమానాలు

యూరియా కోసం కూపన్లు ఇచ్చి మరీ రైతులను గంటల తరబడి క్యూలో నిలబెట్టి, ఒకే ఒక్క బస్తా ఇస్తున్న అధికారులు.. టీడీపీ నేతకు లారీలకు లారీలతో యూరియా ఇవ్వడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యూరియా అక్రమ దందాలో అధికారుల వద్ద ఉండాల్సిన ఈ–పోస్ యంత్రాలు ఏకంగా అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిన విషయం విజిలెన్స్ విచారణలో బయటపడింది. ఇదే అదునుగా యూరియాను నకిలీ వేలిముద్రలతో యథేచ్ఛగా అమ్ముకుని సొమ్ము చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. టీడీపీ నేతలకు కొంతమంది అధికారులు సహకరించడం వల్లే ఈ దందా జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విక్రయానికి వైద్య విద్య!

- గత ప్రభుత్వ హయాంలో కోనసీమకు జిల్లాకు కేటాయింపు
- నేడు ప్రైవేటుకు అప్పగించాలని కూటమి సర్కారు నిర్ణయం
- అమలాపురంలో ఇప్పటికే నిలచిన నిర్మాణ పనులు
- వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై వెల్లువెత్తుతున్న నిరసనలు
- నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో 'చలో మెడికల్ కాలేజ్'



కామనగరువు వద్ద అర్ధాంతరంగా నిలిచిపోయిన అమలాపురం వైద్య కళాశాల భవనాల నిర్మాణం

సాక్షి, అమలాపురం: ప్రభుత్వ వైద్య విద్యను అంగడి సరకుగా మార్చాలనే కూటమి ప్రభుత్వ తీరుపై జిల్లావ్యాప్తంగా నిరసనలు పెల్లుబుకుతున్నాయి. సామాన్య, పేద, బడుగు వర్గాలకు వైద్య విద్యను దూరం చేసే చంద్రబాబు మార్కు పీపీపీ విధానంపై ఆగ్రహంతో రగిలిపోతున్నారు. కోవిడ్ కష్టకాలంలో మారుమూల పల్లెల్లో వైద్యులు లేకపోవడం.. ఆస్పత్రుల్లో పడకల కొరతను గుర్తించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గానికి ఒక వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ లక్ష్యానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడిచి దానిని ప్రైవేట్ పరం చేయాలని నిర్ణయించింది.

జిల్లాకు ఒక ప్రభుత్వ వైద్య కళాశాల, దానికి అనుబంధంగా ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకు రూ.500 కోట్లు కేటాయించి, వైద్య కళాశాలను మంజూరు చేసింది. అలాగే, అమలాపురం ఏరియా ఆస్పత్రిని బోధనాస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయా లని నిర్ణయించింది. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా వైద్య విద్య అభ్యసించేవారి సంఖ్య పెరుగుతుంది. ప్రభుత్వం వైద్య విద్య వల్ల పేద, మధ్య తరగతి వారికి మేలు జరుగుతుందని గత ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలో జిల్లా కేంద్రం అమలాపురానికి సమీపాన సమనస, చిందాడగరువు పరిధిలో కాలేజీ నిర్మాణానికి రూ.500 కోట్లు మంజూరు చేసింది. దీని నిర్మాణ పనులకు 2021లో అప్పటి సీఎం జగన్ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు.గత ప్రభుత్వ హయాంలో కాలేజీ నిర్మాణ పనులు వేగంగా **జరిగాయి. తరగతి గదులు, వసతి గృహాలు, ఇతర నిర్మాణ పనులు సైతం అంతే చురుగ్గా జరిగాయి. కొన్ని భవనాలకు రెండు, నాలుగు అంతస్తులు సైతం నిర్మించారు. కాలేజీకి అనుబంధంగా అమలా**పురం ఏరియా ఆసుపత్రిని బోధనాస్పత్రిగా విస్తరించాలని నిర్ణయించారు. వంద పడకల ఆస్పత్రిగా ఉన్న దీనిని తొలి దశలో 650 పడకలుగా, తరువాత మరింత విస్తరించి వెయ్యి పడకల ఆసుపత్రిగా మార్చాలని ప్రతిపాదించారు. దీంతో, అమలాపురంలో అన్ని వసతులతో కూడిన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అందుబాటులోకి వస్తుందని కోనసీమ వాసులు భావించారు. స్థానికంగా వంద పడకల ఏరియా ఆస్పత్రి, కిమ్స్ మెడికల్ కాలేజీలు ఆస్పత్రులు మాత్రమే పెద్దవి. మిగిలిన ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నా వాటిలో పడకల సంఖ్య చాలా తక్కువ. స్థానికులు ఎటువంటి వైద్యం చేయించుకోవాలన్నా కాకినాడ, రాజమహేంద్రవరం వెళ్లాల్సి వస్తోంది.

పీపీపీ పేరుతో ప్రైవేట్ పరం

పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను, సామాన్యులకు ఉచిత వైద్యాన్ని దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని ప్రైవేట్‌కు అప్పగించనుంది. దీనికి నిధుల కొరతను బూచిగా చూపిస్తోంది. ప్రైవేట్‌కు అప్పగించే ఉద్దేశంతో **అధికారంలోకి** వచ్చిన తరువాత నిర్మాణంలో **ఉన్న మెడికల్ కాలేజీ**ల నిర్మాణ పనులపై నిర్లక్ష్యం **చూపింది. ఏడాది** క్రితం ఆ పనులు దాదాపు **నిలిపివేసింది.** అమలాపురం మెడికల్ కాలేజీ **నిర్మాణ పనులు** కూడా నిలిచిపోయాయి. దీనిపై **స్థానిక సంస్థల** ప్రతినిధులు జిల్లా కలెక్టర్ ఆర్.**మహేష్‌కుమార్,** ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనంద**రావులకు ఫిర్యాదు** చేసినా ఫలితం లేకపోయింది. **నిర్మాణ సంస్థ** చాలా వరకు నిర్మాణ సామగ్రిని **పట్టుకుపోయింది.**


నేడు చలో మెడికల్ కాలేజీ

వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేయాలనే కూటమి ప్రభుత్వ నిర్ణయంపై అన్ని వర్గాల నుంచీ నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం మొండిగా ముందుకు పోతోంది. దీనిపై వైఎస్సార్ సీపీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టింది. దీనిలో భాగంగా అమలాపురంలో శుక్రవారం 'చలో మెడికల్ కాలేజీ' నిరసన చేపట్టనుంది. వైఎస్సార్ సీపీ క్యాడర్‌తో పాటు స్థానికులు, యువత, విద్యార్థులు కూడా ఈ ఆందోళనలో పాల్గొన్నారు.

వారి త్యాగాలకు విలువేది?

కామనగరువు, చిందాడగరువు, రోళ్లపాలెం సరిహద్దులలో ప్రభుత్వ వైద్య కళాశాలలు నిర్మిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని స్థానికులు భావించారు. ఇక్కడ మెడికల్ కాలేజీ నిర్మాణం, రోడ్లు, ఇతర అవసరాల కోసం 52 ఎకరాల భూమిని సేకరించారు. అలాగే భూములు ఇచ్చిన రైతులు కూడా తమ పిల్లలు, కుటుంబ సభ్యులకు దీనిలో ఉద్యోగాలు కల్పిస్తారనే హామీలు పొందారు. ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అలాగే స్థానికంగా ఉన్న కాలనీ వాసులు సైతం కాలేజీ ఏర్పాటు వల్ల ఇబ్బంది తప్పదని తెలిసి కూడా ప్రభుత్వ కళాశాల కావడంతో అంగీకరించారు. ఇప్పుడు ప్రైవేట్ పరం చేస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. 'రాజధాని అమరావతికి భూములు ఇచ్చినవారిని త్యాగమూర్తులు అన్న ప్రభుత్వం మా త్యాగాలను ఎందుకు గుర్తించడం లేదు' అని ప్రశ్నిస్తున్నారు.

అన్ని వర్గాలూ తరలిరావాలి



ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేట్ పరం చేయడం చాలా దారుణం. దీని వల్ల సామాన్యులకు వైద్యం, పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతాయి. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం 'చలో మెడికల్ కాలేజీ' నిర్వహిస్తున్నాం. మెడికల్ కాలేజీ దగ్గరకు శాంతియుతంగా పెద్ద ఎత్తున వెళ్లి, వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించనున్నాం. కోనసీమ జిల్లాతో పాటు కాకినాడ జిల్లాకు చెందిన వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, మండల పార్టీల విభాగాలు, అనుబంధ విభాగాల నాయకులు పాల్గొనున్నారు.

– చిర్ల జగ్గిరెడ్డి, వైఎస్సార్ సీపీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

వివాహిత అనుమానాస్పద మృతి



గట్టున సత్యవతి (ఫైల్)

నిడదవోలు: మండలంలోని శెట్టిపేట గ్రామంలో ఒక మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగుచూసింది. పట్టణ ఎస్సై జగన్‌మోహన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో వాటర్‌ట్యాంక్ ప్రాంతంలో గట్టున సత్యవతి (55) ఒంటరిగా నివసిస్తోంది. భర్త కోటయ్య గతంలో మృతిచెందారు. సత్యవతి చెల్లెలు కాకుమళ్ల దేవి గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఫోన్ చేయగా ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో ఇంటి పక్కన ఉంటున్న కూనపురెడ్డి గంగారత్నంకు ఫోన్ చేసి మా అక్కను చూడాలని కోరింది. గంగారత్నం ఇంటికి వెళ్లి చూడగా సత్యవతి బాత్రూరూంలో రక్తపు మడుగులో పడి ఉండటం గమనించింది. ఈ మేరకు పోలీసులకు సమాచారం ఇవ్వగా పట్టణ ఎస్సై జగన్‌మోహన్‌రావు సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. మృతురాలి చెల్లెలు దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సమిశ్రగూడెంలో రెండు చోట్ల చోరీలు



సమిశ్రగూడెంలో చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్సై బాలాజీ సుందరరావు

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెంలో గురువారం తెల్లవారు జామున రెండుచోట్ల జరిగిన దొంగతనాలపై కేసులు నమోదైనట్టు ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు అన్నారు. సమిశ్రగూడెంలోని శ్రీనివాస మెడికల్ షాప్ వీధిలో దంగుల కొండమ్మ ఇంట్లో రూ.80 వేల నగదుతో పాటు 26 తులాల వెండీ, అర కాసు బంగారం, కాల్వగట్టుపై ఉన్న కొండేపూడి సుధీర్‌కు చెందిన టీ టైం షాపులో రూ.20 వేల నగదు, 6 గ్రాముల బంగారం, ఒక సెలఫోన్ అపహరించినట్లు బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. చోరీ జరిగిన ప్రాంతాలను ఎస్సై బాలాజీ సుందరరావు పరిశీలించి బాధితుల నుంచి వివరాలు అడిగి నమోదు చేసుకున్నారు.

నర్సింగ్.. మరింత మెరుగ్గా..



వార్డుల్లో రికార్డుల పరిశీలన

- జీజీహెచ్‌లో సమూల మార్పులు
- ప్రత్యేక కార్యాచరణ అమలు
- సకాలంలో విధుల నిర్వహణ
- తొలగుతున్న వ్యత్యాసాలు

కాకినాడ క్రైం: వైద్యులతో సమానంగా రోగులకు సేవలందించడంలో నర్సుల పాత్ర కీలకం. నిస్సత్తువతో ప్రాణాలు కళ్లలో పెట్టుకుని బతుకీడుస్తున్న రోగుల హృదయాల్లో వారి స్థానం ఎంతో ఉన్నతం. కన్నతల్లిని, తోబుట్టువుని మరిపించే ఆత్మీయత వారి సొంతం. వారి సేవలు మరింత మెరుగుపడేలా కాకినాడ జీజీహెచ్‌లో అంకురార్పణ పడింది. ఈ మేరకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధమైంది. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి పర్యవేక్షణలో నర్సింగ్ సూపరింటెండెంట్ కల్పన మౌళి ఆధ్వర్యంలో ఆ దిశగా చర్యలు కొనసాగుతున్నాయి.

ప్రతి వార్డు పరిశీలన

ఆస్పత్రిలో ప్రతి వార్డును పరిశీలిస్తూ నర్సింగ్ సూపరింటెండెంట్ సహా హెడ్ నర్సులు వారికి అందుతున్న సేవలపై రోగులను ఆరా తీస్తున్నారు. నర్సులు, నర్సింగ్ విద్యార్థుల ప్రవర్తన స్నేహపూర్వకంగా ఉంటున్నదీ లేనిదీ అడిగి తెలుసుకుంటున్నారు.

తారతమ్యాలు రూపుమాపేలా...

నర్సుల్లో రెగ్యులర్, కాంట్రాక్టు అనే భేదం లేకుండా చూస్తున్నారు. ఎవరెంత అనుకున్నా ఈ వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తుంటుంది. తమ అదృష్టం పండి అర్హత తక్కువగా ఉండీ కూడా రెగ్యులర్ ఉద్యోగులుగా కొనసాగుతున్న కొందరు నర్సులు, ఉన్నత చదువులు చదివి కాంట్రాక్టు నర్సులుగా పనిచేస్తున్న వారిపై అజమాయిషీ చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పని విషయంలోనూ కాంట్రాక్టు సిబ్బందిపై పని భారాన్ని మోపుతుంటారు. అలాగే ఆస్పత్రిలో ఉన్నతాధికారులతోనూ రెగ్యులర్ సిబ్బందే టచ్‌లో ఉంటారు. అధికారులు సైతం రెగ్యులర్, కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బందిని సమానంగా చూడకపోవడం మరో సమస్య. నైట్ డ్యూటీ విషయంలోనూ ఇదే వ్యత్యాసం. కాగా నర్సింగ్ సూపరింటెండెంట్ కల్పన తాజా నిర్ణయంతో అసమానతలకు చెక్ పట్టేందుకు ప్రణాళిక సిద్ధమైంది. అందులో భాగంగా



రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీస్తూ..

అందరికీ సమానంగా నైట్ డ్యూటీలు వేస్తున్నారు. రుబాబులకు కాలం చెల్లింది. ఏళ్లకు ఏళ్లు ఒకే వార్డులో కొనసాగుతున్న 49 మంది నర్సులకు స్థాన



రోగులకు వడ్డిస్తున్న నర్సులు

చలనం కల్పించారు. వివిధ సమస్యలతో పాటు అంతర్గత విభేదాలనూ అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. సమయ పాలన విషయంలోనూ నిర్దిష్ట సమయానికి పది నిమిషాలు గ్రేస్ పిరియడ్ ఇచ్చి విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకున్నారు.

ఆహారంలోనూ జాగ్రత్తలు

రోగులకు అందిస్తున్న ఆహారాన్ని అందరికీ అందజేయడంతో పాటు నాణ్యతను పరిశీలించి నర్సింగ్ సూపరింటెండెంట్‌కు నివేదించే ఏర్పాటు చేశారు.

క్లీన్ చేశాక క్లిక్ తప్పనిసరి

వార్డులు శుభ్ర పరిచాక స్టాఫ్ నర్సులు ఫొటోలు తీసి గ్రూప్‌లో అప్‌లోడ్ చేయడం తప్పనిసరి. వార్డు పరిశుభ్రతను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు. రోగి మంచంపై దుప్పట్లు మార్చడంలో నర్సులు సంబంధిత సిబ్బందికి ప్రత్యేక ఆదేశాలు ఇస్తున్నారు. రోగికి అనుగుణంగా వీటిని తీర్చిదిద్దుతున్నారు.

మంచి దిశగా అడుగులు



రోగులకు మంచి జరిగేలా నర్సింగ్ సూపరింటెండెంట్ కల్పన మౌళి ఆధ్వర్యంలో నర్సింగ్ బృందం వారి సేవల్లో సానుకూల మార్పులు తీసుకువచ్చారు. తాజా మార్పులను ఆహ్వానిస్తున్నాం. మంచి దిశగా అడుగులు పడే క్రమంలో ఎదురయ్యే సవాళ్లకు అండగా ఉంటాం. రోగుల సంరక్షణే పరమావధి.

– డాక్టర్ లావణ్యకుమారి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కాకినాడ

ఉత్తమ నర్సింగ్ సేవలే లక్ష్యం



కాకినాడ జీజీహెచ్‌లో ఉత్తమ నర్సింగ్ సేవలే లక్ష్యంగా సానుకూల మార్పులకు శ్రీకారం చుట్టాం. అమలు చేసే క్రమంలో పలు సవాళ్లు ఎదుర్కొన్నాం. చేపట్టిన మార్పులు రోగులకు మంచి చేస్తుంటే తాము పడిన కష్టం మర్చిపోతున్నాం. నర్సులు ఎంతగానో సహకరిస్తున్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి సహకారంతో వార్డుల్లో నర్సింగ్ సేవలపై నిశిత పరిశీలన చేపట్టి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

– టీఎస్ కల్పన మౌళి, గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్, జీజీహెచ్, కాకినాడ

ఆమె స్థానం గురుతరం



- డీఎస్సీ-2025లో వారిదే హవా
- 51.6 శాతం పోస్టులకు ఎంపిక

రాయవరం: పరీక్షలు ఏవైనా ఫలితాల్లో చాలా వరకు బాలికలే ప్రతిభ కనబరచడం చూస్తుంటాం. ఇటీవల నిర్వహించిన డీఎస్సీ-2025లో కూడా మహిళలు సత్తా చాటారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 51.6 శాతం మంది ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. మొత్తం 1,352 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయగా, 1,349 మంది ఫైనల్ సెలక్షన్ జాబితాలో ఉన్నారు. నాలుగు పోస్టులకు వివిధ కారణాలతో అభ్యర్థులు లేక పోవడంతో అవి భర్తీ కాలేదు. ఫైనల్ సెలక్షన్ జాబితాకు ఎంపికైన 1,349 పోస్టుల్లో వారిదే అగ్రస్థానంగా ఉంది. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, టీజీటీ, పీజీటీ తదితర పోస్టులకు పురుషులు, మహిళా అభ్యర్థులు పోటీ పడ్డారు. తుది జాబితాకు ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థుల్లో 653 (48.4శాతం) మంది పురుష ఉపాధ్యాయ అభ్యర్థులు ఉండగా, 696 (51.6శాతం) మంది మహిళా ఉపాధ్యాయ అభ్యర్థులు ఉన్నారు. గణితం, పీఎస్, సోషల్ స్టడీస్, ఇంగ్లిషు వంటి సబ్జెక్టులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ మినహా మిగిలిన సబ్జెక్టులు, ఎస్జీటీ పోస్టుల్లో మహిళా ఉపాధ్యాయులే అధిక సంఖ్యలో ఎంపిక కావడం గమనార్హం.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ పోస్టులకు ఎంపికైన వారి వివరాలు ఇలా

సబ్జెక్టు	మేల్	ఫిమేల్	మొత్తం
ఎస్ఏ తెలుగు	23	35	58
ఎస్ఏ ఇంగ్లీషు	50	45	95
ఎస్ఏ హిందీ	12	66	78
సంస్కృతం	03	02	05
ఎస్ఏ బయాలజీ	45	62	107
ఎస్ఏ ఫిజికల్ సైన్స్	55	19	74
ఎస్ఏ గణితం	44	20	64
ఎస్ఏ సోషల్ స్టడీస్	84	48	132
ఎస్ఏ (పీఈ)	142	69	211
ఎస్జీటీ (మైదానం)	167	254	421
ఎస్జీటీ (ఏజెన్సీ)	28	76	104
మొత్తం	653	696	1,349

ప్రభుత్వ/జెడ్పీ, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్, ట్రైబల్ వెల్ఫేర్ వంటి యాజమాన్యాలకు చెందిన ఉపాధ్యాయ పోస్టుల్లో మహిళలదే హవా కన్పించింది.

అనధికార డీజిల్ డంపింగ్‌పై కేసు

రాజానగరం: మండలంలోని తూర్పుగానుగూడెం ఐఎస్‌టీఎస్ ఇంజినీరింగ్ ప్రాంగణంలో అనధికారికంగా జరుగుతున్న డీజిల్ ఆయిల్ డంపింగ్‌పై గురువారం సాయంత్రం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి వాహనాన్ని సీజ్ చేసి, పలువురిపై కేసు నమోదు చేశారు. ముందుగా అందిన సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ ఎస్.తాతారావు ఆధ్వర్యంలో సివిల్ సప్‌లైస్, లీగల మెట్రాలజీ, ట్రాన్స్‌కో శాఖల అధికారులు గొలుగూరి బాపిరాజు, శివ, వలీ తదితరుల ఆధ్వర్యంలో ఈ దాడి జరిగింది. ఎంఎస్‌ఓ జి.బాపిరాజు తెలిపిన వివరాల మేరకు రాజమహేంద్రవరానికి చెందిన మేడిశెట్టి గంగరాజు గత మే నెలలో కొనుగోలు చేసిన 2 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన బొలెరో మినీ ట్యాంకర్ నుంచి కళాశాల ప్రాంగణంలో ఒక బస్సుకు అనధికారికంగా డీజిల్ కొడుతుండగా పట్టుకున్నారు. వాటి బిల్లులను మాత్రం వారు చూపలేకపోయారు. తన యజమాని డీజిల్ ఆయిల్ లోడు చేసిన ఈ వాహనాన్ని రాజమహేంద్రవరంలో తనకు ఇచ్చి, ఐఎస్‌టీఎస్‌కి వెళ్లి అన్‌లోడ్ చేయమన్నాడని ఆత్రేయపురానికి చెందిన ట్యాంకర్ డ్రైవర్ పల్లికొండ రాజేష్ తెలిపాడు. వాహన రికార్డులు పరిశీలిస్తే 983 లీటర్ల డీజిల్ ఆయిల్‌ను ఇక్కడ వాహనాలకు కొట్టినట్టుగా గుర్తించామన్నారు. దీని విలువ రూ.97,315 ఉంటుందని అంచనా. వాహనం విలువ రూ.15 లక్షలు వరకు ఉంటుందన్నారు. ట్యాంకర్ యజమాని, డ్రైవర్ల పై కేసులు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేశామన్నారు.

జాతీయ యోగాలో దేవాన్ష్‌కు రజతం

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థలో తొమ్మిదో తరగతి చదువుతున్న బండారు దేవాన్ష్ నాయుడు అండర్ 17 వ్యక్తిగత జాతీయ యోగా పోటీల్లో ద్వితీయ స్థానం సాధించి రజత పతకం గెలుపొందినట్టు విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయప్రకాష్ గురువారం తెలిపారు. ఈ నెల 13 నుంచి 16 వరకు హర్యానా రాష్ట్రం కర్నాల్ పట్టణంలో జాతీయ స్థాయి యోగా పోటీలు జరిగాయన్నారు. తమ విద్యార్థి రజత పతకం సాధించడం గర్వకారణమన్నారు. జాతీయస్థాయిలో ప్రతిభకనబర్చిన దేవాన్ష్ నాయుడిని విద్యా సంస్థల అధినేత సీహెచ్ వీకే నరసింహరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.అరుణ, యోగా గురువు సురేష్ అభినందించారు.



దేవాన్ష్ నాయుడిని అభినందిస్తున్న శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత నరసింహరావు

పాత కక్షలతో వ్యక్తిపై ముగ్గురి దాడి

బాధితుడికి 8 చోట్ల కత్తెర పోట్లు



కత్తెర పోట్లకు గురైన రాంబాబు

అమలాపురం టౌన్: రెండు కుటుంబాలకు మధ్య నెల కొన్న పాత కక్షల నేపథ్యంలో ఒకరిపై ముగ్గురు వ్యక్తులు కత్తెరతో 8 చోట్ల దాడి చేశారు. స్థానిక మున్సిపల్ కాలనీకి చెందిన ముమ్మిడివరపు రాంబాబుపై అదే కాలనీకి చెందిన తమ్ములపల్లి పవన్‌కుమార్, భవిరిశెట్టి ధనుష్ అనే అఖిల్, భవిరిశెట్టి వెంకట నర్సమ్మ టైలరింగ్ కత్తెరతో దాడిచేసి గాయపరచినట్టు కేసు నమోదైంది. వీరు మున్సిపల్ కాలనీ సమపంలోని ఆమని ఆటో మొబైల్స్ షాపు ఎదురుగా రోడ్డుపై బుధవారం అర్ధరాత్రి ఘర్షణ పడ్డారు. కోపాద్రిక్తులైన పవన్‌కుమార్, అఖిల్ కత్తెరతో రాంబాబు శరీరంపై విచక్షణా రహితంగా పొడిచారు. ఈ సమయంలో పవన్‌కుమార్, అఖిల్‌ను దాడికి పురిగొల్పిన భవిరిశెట్టి వెంకట నరసమ్మపై కూడా కేసు నమోదైంది. ఇదలా ఉంటే తొలుత ముమ్మిడివరపు రాంబాబే తమ్మలపల్లి పవన్‌కుమార్‌ను గాయపరిచాడని పోలీసుల దర్యాప్తులో తేలింది. తమ్మలపల్లి పవన్‌కుమార్ ఫిర్యాదు మేరకు ముమ్మిడివరపు రాంబాబుపై కౌంటర్ కేసు నమోదైంది. సీఐ పి.వీరబాబు పర్యవేక్షణలో ఎస్సై ఎన్ఆర్ కిషోర్‌బాబు రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి



మృతుడు గుబ్బల పవన్‌కుమార్

ముమ్మిడివరం: మోటారు సైకిల్‌పై వెళ్తున్న యువకుడిని టాటా ఏస్ వాహనం ఢీకొనడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ముమ్మిడివరం నగర పంచాయతీ శివారు రాజుపాలెం సెంటర్‌లో మోటారు సైకిల్ మెకానిక్‌గా పనిచేస్తున్న గుబ్బల పవన్‌కుమార్ (27) మోటారు సైకిల్‌పై రాజుపాలెం ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వాహనం అతి వేగంగా వచ్చి ఢీకొట్టి పక్కనే ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు ఈడ్చుకుపోయింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పవన్‌కుమార్ అవివాహితుడు. అతడికి తల్లిదండ్రులు శ్రీనివాసరావు, సత్యవతి, చెల్లి ఉన్నారు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాల చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

కె.గంగవరం: మండలంలో వాహన చోరీలకు పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై జానీ బాషా గురువారం విలేకరులకు తెలిపారు. రామచంద్రపురం పట్టణానికి చెందిన పెమ్మిరెడ్డి బాల వెంకట్ ఈ చోరీలకు పాల్పడ్డాడని, ఆ వాహనాలను కోటిపల్లికి చెందిన కర్రి సత్యనారాయణ అలియాస్ నాని, కె.గంగవరం గ్రామానికి చెందిన పెంటపాటి వీరబాబులకు విక్రయించినట్లు తెలిపారు. ఈ ముగ్గురిని గురువారం అరెస్టు చేసి రామచంద్రపురం కోర్టుకు తరలించడగా వారికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. వీరి నుంచి 6 వాహనాలను స్వాధీనం చేసుకుని వాటి యజమానులకు అప్పగించినట్లు తెలిపారు. కేసును సీఐ వెంకట నారాయణ పర్యవేక్షణలో ఛేదించినట్లు తెలిపారు. కాగా వీరబాబు దగ్గర మరో 20 వరకు చోరీ చేసిన బైకులు ఉన్నట్లు సమాచారం.

వాడపల్లి వెంకన్నకు రూ.2.4 లక్షల విరాళాలు



దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న డీసీ అండ్ ఈఓ చక్రధరరావు

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి క్షేత్రంలో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి భక్తులు విరివిగా విరాళాలు సమర్పిస్తున్నారు. దానిలో భాగంగా విశాఖపట్నం జిల్లా చిన్న ముషిడివాడకు చెందిన సిరికి అప్పాజీరావు, శ్రీదేవి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ 2,00,116, మండపేటకు చెందిన ఉంగరాల సీతరాంప్రసాద్, పద్మావతి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.40,116 విరాళంగా సమర్పించారు. వారు ముందుగా స్వామి వారిని దర్శించుకున్నారు. దాతలకు దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటాన్ని అందచేశారు.

క్యాష్ కౌంటింగ్ మెషీన్ సమర్పణ

వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి భక్తులు సమర్పించే నగదు లెక్కింపు నిమిత్తం రావులపాలెం మండలం లక్ష్మీపోలవరంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు తరపున క్యాష్ కౌంటింగ్ మెషీన్‌ను బహూకరించారు. ఆ మేరకు గురువారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దానిని బ్యాంకు ఆర్ఎం జీ శ్రీనివాసరావు డీసీ అండ్ ఈఓ చక్రధరరావుకు అందచేశారు. కార్యక్రమంలో బ్యాంకు ప్లానింగ్ హెడ్ ఎంకేఎస్ శంకర్, బీఎం డి.రాజేష్, సిబ్బంది డి.సూర్యగోపాల్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

సమర్థంగా తీవ్రవాదుల ఏరివేత



మాక్‌డ్రిల్ ఆపరేషన్ పుష్కర్‌లో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

- ఓఎన్జీసీలో 'ఆపరేషన్ పుష్కర్'
- వివిధ శాఖల సమన్వయంతో మాక్‌డ్రిల్



ఉగ్రవాదుల కోసం కమెండోల ఆపరేషన్

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వ కార్యాలయాల సమీప ప్రాంతాల్లో భద్రతాపరంగా ఎదురయ్యే విపత్తులను ఎదుర్కొనే విధానంపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఓఎన్జీసీ భద్రతా విభాగం, స్థానిక పోలీసు అధికారులు, ఏపీఎస్పీఎఫ్, ఏపీ పోలీసుల ఆక్టోపస్ కమాండోల మధ్య ప్రతిస్పందన, సమన్వయాన్ని పెంచడానికి గురువారం ఓఎన్జీసీ గోదావరి భవన్‌లో ఈ మేరకు 'ఆపరేషన్ పుష్కర్' నిర్వహించారు. ఓఎన్జీసీ కార్యాలయంలోకి ఉగ్రవాదులు చొరబడి కీలక సిబ్బందిని బందీలుగా తీసుకుపోయే సందర్భాన్ని ఈ మాక్ డ్రిల్‌లో నిర్వహించారు. వైద్య, రెవెన్యూ, అగ్నిమాపక, ఏపీఎస్పీఎఫ్, బొమ్మూరు పోలీస్ స్టేషన్, జిల్లా ఆర్మ్ రిజర్వ్ స్పెషల్ పార్టీ, బాంబు డిస్పోజల్ బృందం, డాగ్ స్క్వాడ్ వంటి వివిధ సహాయక సిబ్బంది ఈ ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించాయి. ఓఎన్జీసీ భద్రత, అగ్నిమాపక బృందాలు ఈ ఆపరేషన్‌లో భాగస్వాములయ్యాయి. మధ్యాహ్నం 3.40 గంటలకు ఈ ఆపరేషన్ ప్రారంభించి రాత్రి 8.30 గంటల వరకు నిర్వహించారు. బందీలుగా ఉన్న కీలక సిబ్బందికి ఎటువంటి గాయాలు కాకుండా విడిపించారు. కమెండోలు గంటల తరబడి ఆపరేషన్ నిర్వహించి సమర్థంగా కట్టడి చేశారు. రాష్ట్ర వైద్య బృందం, ఓఎన్జీసీ వైద్య విభాగం క్షతగాత్రులకు అవసరమైన వైద్య సహాయం అందించారు. అగ్నిమాపక బృందాలు ఘటనా స్థలంలో సత్వర చర్యలకు సిద్ధంగా ఉన్నాయి. తరువాత, డాగ్ స్క్వాడ్ సంఘటనా స్థలాన్ని సందర్శించి తనిఖీలు చేసింది. ఏఎస్పీ (ఏఆర్) చెంచురెడ్డి, డీఎస్పీలు జగ్గు నాయుడు, జి.విశ్వనాథం, విజయవాడలోని ఆక్టోపస్ స్పెషల్ ఫోర్స్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ ఆర్.రాంబాబు ఈ ఆపరేషన్‌లో బ్రీఫింగ్ చేశారు. ఇన్‌చార్జి సెక్యూరిటీ లెఫ్టినెంట్ కల్నల్ కెఎస్ గుసేన్, చీఫ్ మేనేజర్ (సెక్యూరిటీ) పి.శంకర్ ఓఎన్జీసి నుంచి నోడల్ అధికారులుగా వ్యవహరించారు.



ఉద్యోగిని సురక్షితంగా తీసుకువస్తున్న కమెండో

ఇసుక అక్రమ రవాణా అడ్డగింత

అల్లవరం: కొమరగిరిపట్నం రెవెన్యూ సముద్ర తీరం వెంబడి సీఆర్‌జెడ్ పరిధిలో అనధికారికంగా ఇసుక తవ్వకాలు చేస్తూ రాత్రి వేళల్లో సాగుతున్న అక్రమ రవాణాను ఊటగుంట సావరం గ్రామస్తులు బుధవారం రాత్రి అడ్డుకున్నారు. స్థానిక ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కొంత మంది యువకులు ఇసుకను తరలిస్తున్న నాలుగు లారీలను అడ్డుకున్నారు. సీఆర్‌జెడ్ పరిధిలోని ఇసుకను తరలించడానికి వీల్లేదంటూ నిరసన తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై ఎంపీటీసీ స్థానిక తహసీల్దార్ వీవీఎల్ నరసింహరావు దృష్టికి తీసుకెళ్లారు. రాత్రి వేళల్లో లారీల రాకపోకలతో నిద్ర కోల్పోతున్నారని వారు తహసీల్దార్, అల్లవరం పోలీసులకు తెలిపారు. దీనిపై స్పందించిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇసుక రవాణా చేస్తున్న లారీలను స్వాధీనం చేసుకున్నారు.



సావరం గ్రామస్తులు అడ్డుకున్న ఇసుక లారీ

అట్రాసిటీ కేసులో ఒకరి అరెస్ట్



రాజమహేంద్రవరం కోర్టు వద్ద పోలీసుల అదుపులో సత్యనారాయణ

కపిలేశ్వరపురం: మండపేట పోలీసు స్టేషన్‌లో 2019లో నమోదైన అట్రాసిటీ కేసులో నిందితుడు గాడు సత్యనారాయణను అరెస్ట్ చేసినట్టు సీఐ సురేష్ గురువారం తెలిపారు. ఈ కేసులో రాజమహేంద్రవరం ప్రత్యేక కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసిందని, దాని అమలులో భాగంగా హైదరాబాద్‌లో ఉంటున్న సత్యనారాయణను అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం ప్రత్యేక కోర్టులో హాజరుపర్చినట్టు సీఐ సురేష్ తెలిపారు.

లారీని ఢీకొని ఆటో డ్రైవర్ మృతి

సఖ్బవరం: మండలంలోని జాతీయ రహదారి మర్రిపాలెం టోల్‌ప్లాజా వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వెన్నెపూడికి చెందిన దూలిపల్లి అప్పారావు (42) బుధవారం రాత్రి చేగోడీలు, జంతికల లోడుతో కాకినాడ నుంచి విజయనగరం వస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో జాతీయ రహదారిపై మర్రిపాలెం టోల్‌ప్లాజా వద్ద బ్రేక్ డౌన్ అయిన లారీని వెనుకవైపు బలంగా ఢీకొట్టాడు. దీంతో ఆటో ముందుభాగం నుజ్జయింది. డ్రైవర్ అప్పారావు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం తెలుసుకున్న సీఐ రామచంద్రరావు సిబ్బందితో సంఘటన స్థలికి చేరుకుని, ప్రమాద కారణాలను పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్‌ను, లారీని అదుపులోకి తీసుకుని, మృతుడి సోదరుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చెస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

కాకినాడ రూరల్: తూరంగి గ్రామంలోని ఒడ్డు చెరువు ప్రాంతానికి చెందిన వివాహిత బొబ్బిలి సాయి సత్య (29) ఆత్మహత్యకు పాల్పడింది. ఇంద్రపాలెం పోలీసుల కథనం ప్రకారం భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో గురువారం తెల్లవారుజామున ఇంటిలో చీరతో ఉరివేసుకుని ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే భర్త నూకరాజు, కుటుంబ సభ్యులు ఆమెను కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. సత్యకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇంద్రపాలెం ఎస్సై వీరబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350